రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గినా..

ఎగిసిపడుతున్న ఆహార-ఇంధనేతర ఉత్పత్తుల ధరలే ఆందోళనకరం: క్రిసిల్

కోల్‌కతా, జూన్ 19: వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం గత నెలలో తగ్గుముఖం పట్టడం దేశ ఆర్థిక వ్యవస్థకు శుభ శకునమే అయినప్పటికీ.. ఆహారేతర, ఇంధనేతర ద్రవ్యోల్బణాలు ఇంకా ఎక్కువగానే ఉండటం ఆందోళనకరమేనని ప్రముఖ రేటింగ్స్ ఏజెన్సీ క్రిసిల్ లిమిటెడ్ అభిప్రాయపడింది. మే నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.8 శాతంగానే ఉన్నది. ఆహార ద్రవ్యోల్బణం దిగిరావడం కలిసొచ్చింది. అయితే వరుసగా 4 నెలల నుంచి ఆహార-ఇంధనేతర ద్రవ్యోల్బణాలు 4 శాతంపైనే కదలాడుతుండటం మాత్రం ఆమోదయోగ్యం కాదని క్రిసిల్ అంటున్నది. ఆహార, ఇంధన ఉత్పత్తులు మినహా మిగతా వాటి ధరలు ఎక్కువగా ఉన్నాయని గుర్తుచేస్తున్నది. ఈ పరిస్థితులు ఇలాగే ఉంటే కీలకమైన రిటైల్ ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభించే ప్రమాదం ఉందని, ఇదే జరిగితే దేశ ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందేనని వ్యాఖ్యానించింది. ద్రవ్యోల్బణం పెరుగుదల దేశంలో బలపడుతున్న డిమాండ్‌కు అద్దం పడుతుందని అంటూనే.. ధరలకు కళ్లెం వేయాల్సిన అవసరం ఉందనీ చెప్తున్నది. కాగా, దేశీయ పరిస్థితుల కంటే అంతర్జాతీయ ఆర్థిక ఒడిదొడుకులే ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారితీస్తున్నాయని క్రిసిల్ పేర్కొన్నది.

బంగారం ధరలపై..

దేశంలో బంగారం ధరలు అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా కదులుతున్నాయని క్రిసిల్ తెలిపింది. గోల్డ్ రేట్లపై దేశీయ కారణాల ప్రభావం చాలా తక్కువేనని కూడా పేర్కొన్నది. అయితే రిటైల్ ద్రవ్యోల్బణంలో బంగారం ధరల వాటా 1.1 శాతంగా ఉంటుందన్నది. కానీ ఆహార-ఇంధనేతర ద్రవ్యోల్బణాలపై పసిడి విలువ ప్రభావం ఎక్కువేనని వివరించింది. ఇతర దేశాలతో పోల్చితే భారత్‌లో బంగారం వినియోగం ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణంగా పేర్కొన్నది.

రెండు నెలల కనిష్ఠానికి రూపాయి

రూపాయికి మరిన్ని చిల్లులుపడ్డాయి. వరుసగా మూడోరోజూ గురువారం రూపాయి విలువ 30 పైసలు పడిపోవడంతో రెండు నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడం, క్రూడాయిల్ ధరలు భగ్గుమనడంతో రూపాయిపై ప్రతికూల ప్రభావం చూపింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 30 పైసలు పడిపోయి 86.73 వద్ద నిలిచింది. గత మూడు రోజుల్లో 69 పైసలు పడిపోయినట్టు అయింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనుకావడం, ఇరాన్-ఇజ్రాయిల్ దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడం కూడా రూపాయిపై ప్రతికూల ప్రభావం పడిందని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు.

ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ వార్షికోత్సవ ఆఫర్

ముంబై, జూన్ 19: ఎల్ఐసీ హౌజింగ్ ఫైనాన్స్ లిమిటెడ్(ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్) తన వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 36వ వార్షికోత్సవం సందర్భంగా గృహ రుణాలు తీసుకునేవారికి ప్రాసెసింగ్ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తున్నట్టు ప్రకటించింది. ఈ నెల 1 నుంచి 30 లోపు తీసుకునే గృహ రుణాలపై ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజును వసూలు చేయడం లేదని కంపెనీ ఎండీ, సీఈవో త్రిభువన్ అధికారి తెలిపారు. 1989లో ప్రారంభమైన సంస్థ..ఇప్పటి వరకు 34 లక్షల మందికి రూ.3 లక్షల కోట్లకు పైగా గృహ రుణాలు మంజూరుచేసింది.

వెండికి తగ్గిన డిమాండ్

న్యూఢిల్లీ, జూన్ 19: గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన వెండి ఎట్టకేలకు శాంతించింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ పడిపోవడంతో కిలో వెండి ఏకంగా రూ.1,000 తగ్గి రూ.1,07,200కి దిగొచ్చింది. ఈవారంలో వెండి ధర చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,08,200 పలికిన విషయం తెలిసిందే. రికార్డు స్థాయికి దూసుకుపోవడంతో వెండిని కొనుగోలు చేయడానికి సామాన్యులు జంకుతున్నారు. వెండితోపాటు బంగారం ధరలు కూడా దిగొచ్చాయి. బంగారం ధర రూ.150 తగ్గి రూ.1,00,560గా నమోదైంది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర రూ.99,800కి తగ్గింది. వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ అమెరికా ఫెడరల్ రిజర్వు తీసుకున్న నిర్ణయంతో అతి విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టాయని విశ్లేషకులు చెపుతున్నారు.

స్విస్ బ్యాంకుల్లో భారతీయుల సొమ్ము రూ.37,600 కోట్లు

న్యూఢిల్లీ/జ్యూరిచ్, జూన్ 19: స్విస్ బ్యాంకుల్లో భారతీయుల సొమ్ము గత ఏడాది మూడింతలకుపైగా ఎగిసింది. 2024లో దాదాపు రూ.37,600 కోట్ల (3.5 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్)కు చేరినట్టు గురువారం స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ విడుదల చేసిన వార్షిక గణాంకాలు చెప్తున్నాయి. 2021 తర్వాత స్విస్ బ్యాంకుల్లో ఇండియన్ మనీ ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. నాడు 14 ఏండ్ల గరిష్ఠాన్ని తాకుతూ 3.83 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌గా ఉన్నాయి. కాగా, స్థానిక బ్యాంక్ శాఖలు, ఇతర ఆర్థిక సంస్థల్లోకి పెద్ద ఎత్తున నిధులు వచ్చాయని కేంద్ర బ్యాంక్ పేర్కొన్నది. నిజానికి 2023లో నాలుగేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ స్విస్ బ్యాంకుల్లో భారతీయుల నగదు నిల్వలు 1.04 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌కు పడిపోయాయి. ఈ ఒక్క ఏడాదే 70 శాతం క్షీణించాయి. అయితే మరుసటి ఏడాదే తిరిగి సుమారు 2.5 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్ పెరగడం గమనార్హం.

డిపాజిట్లు రూ.3,675 కోట్లు

స్విస్ బ్యాంకుల్లోని భారతీయ కస్టమర్ అకౌంట్లలో డిపాజిట్లు దాదాపు రూ.3,675 కోట్లు (346 మిలియన్ స్విస్ ఫ్రాంక్స్)గా ఉన్నాయి. గతంతో పోల్చితే 11 శాతం పెరిగాయి. అలాగే అక్కడి బ్యాంక్ ఖాతాల్లో ఉన్న మొత్తం భారతీయుల సొమ్ములో ఇది 10 శాతానికి సమానంగా ఉన్నది. ఈ మేరకు స్విస్ నేషనల్ బ్యాంక్ (ఎస్ఎన్‌బీ)కు అక్కడి బ్యాంకులు వివరాలందించాయి. కాగా, స్విస్ బ్యాంకుల్లో భారతీయుల ధనం 2006లో ఆల్‌టైమ్ హైని తాకుతూ దాదాపు 6.5 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌గా నమోదైంది. ఆ తర్వాత క్రమేణా తగ్గుతూ వచ్చింది. ఈ సొమ్ము వ్యక్తులు, బ్యాంకులు, సంస్థల ద్వారా వచ్చినట్టు ఎస్ఎన్‌బీ తెలిపింది. డిపాజిట్లు 2007 ఆఖర్లో గరిష్ఠంగా రూ.9,000 కోట్ల (2.3 బిలియన్ డాలర్లు)కుపైగా నమోదయ్యాయి. 2018 నుంచి భారత్, స్విట్జర్లాండ్ మధ్య పన్ను సంబంధిత అంశాల్లో ఆటోమెటిక్ సమాచార మార్పిడి ఒప్పందం అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం స్విస్ ఆర్థిక సంస్థల్లో ఉన్న భారతీయులందరి ఖాతాల పూర్తి వివరాలు భారత్‌కు స్విట్జర్లాండ్ చెప్పాల్సిందే.

జీడిమెట్ల, శేరిలింగంపల్లిలోని పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యం

కాలుష్య పరిశ్రమల మాటేంటి?

ఔటర్ వెలుపలికి పంపేదెప్పుడు • హడావుడిచేసి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రణాళికలు కాగితాలకే పరిమితం • ప్రతిపాదన పక్కకు పెట్టామంటున్న అధికారులు

బీఆర్ఎస్ హయాంలోనే ప్రత్యామ్నాయ భూములు • అయినా రేవంత్ సర్కారు మీనమేషాలు

- హైదరాబాద్ నగరంలో 1,746 కంపెనీలు కాలుష్యానికి కారణమవుతున్నట్టు ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ) గుర్తించింది.
- కాలుష్యాన్ని వెదజల్లుతున్న ఫార్మా, కెమికల్, మెటల్, పేపర్, రబ్బర్, పెయింట్స్, టెక్స్‌టైల్స్ తదితర సంస్థలు.
- 800లదాకా చిన్న, మధ్య, భారీతరహా ఔషధ తయారీ కంపెనీలు.
- పెరిగిపోతున్న వాహన కాలుష్యానికి తోడవుతున్న జనావాసాల మధ్యనున్న పారిశ్రామిక పొల్యూషన్.
- గాలి కాలుష్యమేగాక, పారిశ్రామిక వ్యర్థాలతో తీవ్రంగా జరుగుతున్న భూ, జల కాలుష్యాలు.
- మితిమీరిన కాలుష్యంతో అనారోగ్యం బారిన పడుతున్న సమీప ప్రాంతాల ప్రజలు.
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో పట్టించుకోని అధికారులు. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధితులు.

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో జనావాసాల మధ్య ఉన్న పరిశ్రమలను ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) వెలుపలికి తరలించాలన్న ప్రణాళికలు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రత్యామ్నాయ స్థలాలు సిద్ధంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో చిత్తశుద్ధి లోపించడంతో పరిశ్రమల తరలింపు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన కొత్తలోనే నగరంలోని పరిశ్రమలను ఔటర్ వెలుపలికి తరలిస్తామని ప్రకటించినా, కానీ అడుగు కూడా ముందుకు కదల్లేదు. గతంలో శివారు ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలు నగర విస్తరణ వల్ల జనావాసాలు పెరిగిపోయి ఇప్పుడు కాలనీల మధ్యలోకి చేరినట్టైంది. దీంతో కాలుష్య సమస్య ఏర్పడుతుండగా, సదరు పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలికి దశలవారీగా తరలించాలని నిర్ణయించారు.

22 ప్రాంతాల్లో..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పరిశ్రమల తరలింపునకు ఔటర్ వెలుపల 22 ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ భూములను గుర్తించారు. ఇందులో ఉన్న 800 ఫార్మా కంపెనీలను రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో ప్రతిపాదిత ఫార్మా సిటీకి, అలాగే కాటేదాన్, జీడిమెట్లలోని 35 స్టీల్ కంపెనీలను 150 ఎకరాల విస్తీర్ణంగల వికారాబాద్ జిల్లా రాకంచర్ల ఇండస్ట్రియల్ పార్క్‌కు తరలించాలని నిశ్చయించారు. వంటనూనె పరిశ్రమలను జహీరాబాద్‌లోని బుచినేపల్లి ఇండస్ట్రియల్ పార్క్‌కు, టెక్స్‌టైల్ పరిశ్రమలను సంగారెడ్డిలోని ఇంద్రేశం ఇండస్ట్రియల్ పార్క్‌కు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. పరిశ్రమలను తరలించే ఆయా పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు.

పెరుగుతున్న కాలుష్యం

నగరాన్ని కాలుష్య కాసారంగా మారుస్తున్న పరిశ్రమలను జనావాసాలకు దూరంగా పంపించే ప్రక్రియ రేవంత్ సర్కారు అలసత్వంతో ఆగిపోయింది. ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్టు మొదట ప్రకటించిన ప్రభుత్వం.. ఆ తర్వాత కోర్టు ఆదేశాల ప్రకారం గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తామని తెలిపింది. దీంతో ఫార్మా పరిశ్రమలను ఎక్కడికి తరలించాలనేది అంతుబట్టకుండా ఉన్నది. అలాగే ఇతర పరిశ్రమల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వమే స్థలాలను సిద్ధం చేసినప్పటికీ వాటి తరలింపులో ప్రస్తుత ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. ఫలితంగా కాలుష్య సమస్య నానాటికీ పెరుగుతూ పోతున్నది. సమీప కాలనీలవాసులకు ఇది పెను సమస్యగా పరిణమిస్తున్నది. కాగా, ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలకు నోటీసులు జారీ చేసినట్టు టీజీఐఐసీ అధికారులు తెలిపారు. అయితే వివిధ కారణాలతో యజమానులు గడువు కోరుతున్నారని, బలవంతంగా తరలిస్తే లేనిపోని సమస్యలు ఉత్పన్నమవుతాయనే మౌనంగా ఉంటున్నామన్నారు. కాగా, ప్రభుత్వం నుంచి కూడా తమపై ఎటువంటి ఒత్తిడి లేదని వారు అంటుండటం గమనార్హం.

హైదరాబాద్‌లో 'ది కాస్కేడ్స్ నియోపోలిస్'

హైదరాబాద్, జూన్ 19: హైదరాబాద్‌లో మరో అతిపెద్ద రెసిడెన్షియల్ ప్రాజెక్టు అందుబాటులోకి రాబోతున్నది. జీహెచ్ఆర్ ఇన్‌ఫ్రా, లక్ష్మీ ఇన్‌ఫ్రా, అర్బన్‌బ్లాక్స్ రియల్టీలు సంయుక్తంగా 'ది కాస్కేడ్స్ నియోపోలిస్' పేరుతో అతి పొడుడైన ప్రాజెక్టును నిర్మిస్తున్నది. 217 మీటర్ల ఎత్తులో 63 అంతస్తుల మెగా రెసిడెన్షియల్ ప్రాజెక్టును రూ.3,169 కోట్ల పెట్టుబడితో నెలకొల్పుతున్నట్టు జీహెచ్ఆర్ లక్ష్మీ అర్బన్‌బ్లాక్స్ ఇన్‌ఫ్రా భాగస్వామి లక్ష్మీ నారాయణ తెలిపారు. 7.34 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్న ఈ మెగా రెసిడెన్షియల్ ప్రాజెక్టులో 2,560 చదరపు అడుగుల నుంచి 4,825 చ.అ. విస్తీర్ణంలో 3బీహెచ్‌కే, 4 బీహెచ్‌కేలను నిర్మిస్తున్నట్టు చెప్పారు.

నాట్కో ప్లాంట్‌పై అమెరికా అభ్యంతరాలు

హైదరాబాద్, జూన్ 19: రాష్ట్రానికి చెందిన నాట్కో ఫార్మాకి హైదరాబాద్‌లో ఉన్న యూనిట్‌పై అమెరికా నియంత్రణ మండలి అభ్యంతరాలు వ్యక్తంచేసింది. ఈ నెల 9 నుంచి 19 వరకు నగరంలో ఉన్న యూనిట్‌లో తనిఖీలు చేసిన అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఏడు అభ్యంతరాలతో ఫామ్-483 జారీ చేసింది.

ఈ ఉపాధ్యాయుడు అందరికీ ఆదర్శం

తన ముగ్గురు పిల్లలను సర్కార్ బడిలో చదివిస్తున్న సిరికొండ కుమారస్వామి

పిల్లలతో ఉపాధ్యాయుడు కుమారస్వామి.

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 19 : తమ పిల్లలను కార్పొరేట్ పాశాలల్లో చదివిస్తున్నామని గొప్పగా చెప్పుకునే తల్లిదండ్రులు ఈ ఉపాధ్యాయుడిని ఆదర్శంగా తీసుకోవాలి. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం చాగల్లు గ్రామానికి చెందిన సిరికొండ కుమారస్వామి 24 ఏండ్లుగా స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తన ముగ్గురు పిల్లలను తన పనిచేసే పాఠశాలలో చదివిస్తున్నారు. వైష్ణవ్, వైభవ్, వజ్రహాసిని ఫస్ట్ క్లాస్ వరకు అంగన్‌వాడీకి పంపించారు. ఆ తరువాత ఇదే మండలంలోని నమిలిగొండ ప్రభుత్వ పాఠశాలలో 2023-24 సంవత్సరం వరకు పని చేసిన సమయంలో వారిని అదే పాఠశాలలో చదివించారు. అనంతరం గత సంవత్సరం పాంనూర్ యూపీఎస్‌కు బదిలీ కాగా తమ పిల్లలను అదే స్కూల్లో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

వ్యవసాయరంగాన్ని కబళిస్తున్న కార్పొరేట్లు

ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): దేశంలో వ్యవసాయరంగాన్ని నాలుగు కార్పొరేట్ కంపెనీలు కబళిస్తున్నాయని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. విత్తనాలు, పురుగుమందులు ఆ కంపెనీల గుత్తాధిపత్యంలో బందీ అవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అందుకు బీజేపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని మండిపడ్డారు. గురువారం ఎస్‌వీకే దొడ్డి కొమురయ్య హాల్లో అరిబండి ఫౌండేషన్, తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో 'వ్యవసాయం రంగం- ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏండ్లుగా వ్యవసాయరంగంలో అర్థంపర్థంలేని సరళీకరణ విధానాలతో దేశంలో నాలుగున్నర లక్షలమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్ కమిటీ సిఫారులను అమలు చేస్తామని మోసం చేసిందని విమర్శించారు. కరెంట్ మోటర్లకు మీటర్లు బిగించాలని బీజేపీ ప్రభుత్వం పట్టుబడుతున్నదని, దీంతో రూ.12 వేల వరకు భారం రైతులపై పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయంపై ప్రణాళిక లేకపోవడంతో రైతులకు నష్టాలు వచ్చి ఆత్మహత్యలు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

ఐదురోజుల ఏసీబీ కస్టడీకి నూనె శ్రీధర్

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 19 (నమస్తే తెలంగాణ): చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూనె శ్రీధర్‌ను ఐదురోజుల కస్టడీకి అప్పగిస్తూ గురువారం ఏసీబీ కోర్టు జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చాలని ఆదేశాలిచ్చారు. దీంతో నిందితుడిని శుక్రవారం చంచల్‌గూడ జైలు నుంచి ఏసీబీ కార్యాలయానికి తరలించి పూర్తిస్థాయి విచారణ చేపట్టనున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్టు ఆరోపణల నేపథ్యంలో ఆయన ఇండ్లతో పాటు వివిధ ప్రాంతాల్లో సోదాల అనంతరం ఈ నెల 11న శ్రీధర్‌ను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు. తాజాగా నిందితుడిని తమ కస్టడీకి అప్పగించాలని ఏసీబీ అధికారులు పిటిషన్ దాఖలు చేయగా ఉత్తర్వులు జారీ చేశారు.

తల్లిదండ్రులు వేరుగా ఉన్నా పిల్లలను నిర్లక్ష్యం చేయొద్దు

హైదరాబాద్, జూన్19 (నమస్తే తెలంగాణ): వేర్వేరుగా ఉండే తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో ఏకాభిప్రాయంతో ఉండాలని హైకోర్టు సూచన చేసింది. పిల్లలను నిర్లక్ష్యం చేయవద్దని హితవు చెప్పింది. తల్లిదండ్రుల మధ్య ఉండే భేదాభిప్రాయాలు పిల్లలపై పడకుండా జాగ్రతలు తీసుకోవాలని కోరింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో మైనర్ బాలికను నెలరోజుల పాటు తండ్రి కస్టడీకి ఇవ్వాలని తల్లిని ఆదేశించింది. ఆరేండ్ల చిన్నారి వయసును దృష్టిలో పెట్టుకుని బీహెచ్ఈఎల్‌లో ఉండే తండ్రి, హిమాయత్‌నగర్‌లో ఉండే తల్లికి సమీపంలో ఉండాలని సూచించింది. మైనర్ బాలికను కొన్ని రోజులు తండ్రి కస్టడీకి ఇవ్వాలని గత నవంబర్ 18న హైకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని ఉద్దేశపూర్వకంగా అమలుచేయడం లేదని, తన భార్యను శిక్షించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లికి చెందిన తండ్రి హైకోర్టును ఆశ్రయించారు. దీనిని జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ జరిపి పైవిధంగా సూచనలతో కూడిన ఉత్తర్వులను జారీచేశారు.

'బ్రాహ్మణ విదేశీ విద్య'కు మొండి 'చేయి'

- బడ్జెట్‌లో ప్రకటన.. నిధులే ఇవ్వని సర్కార్
- ఏడాదిన్నరగా ఎదురుచూపులు
- గత బడ్జెట్ నుంచి రూ.25 కోట్లు వెనక్కి
- మరో 25 కోట్లకు అనుమతివ్వని ఆర్థిక శాఖ
- డబ్బుల కోసం రోజువారీ పనుల్లో విద్యార్థులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): పేద బ్రాహ్మణ విద్యార్థులకు విదేశీ విద్యనందించే సంకల్పంతో నాటి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన వివేకానంద విదేశీ విద్యా పథకానికి నేటి కాంగ్రెస్ సర్కార్ తూట్లు పొడుస్తున్నది. చివరగా 2023 ఆగస్ట్‌లో ఈ పథకం కోసం దరఖాస్తులను పిలిచారు. అంతకు ముందు ఎంపికైన లబ్ధిదారులకు విడతల వారీగా సాయం అందాల్సి ఉన్నది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నంతవరకు ఈ పథకానికి ఎటువంటి సమస్యా రాలేదు. 2023 ఆగస్ట్ తర్వాత కోడ్ రావడం, ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో బ్రాహ్మణ విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి. విదేశాల్లో విద్యనభ్యసించడానికి ఈ పథకం ఆసరాతో వెళ్లిన విద్యార్థులకు సకాలంలో డబ్బు అందక వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 288 మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా డబ్బులు అందుకోవాల్సి ఉండగా, ఇప్పటివరకు వారికి ఒక్కరూపాయీ అందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్లలో సంక్షేమ పరిషత్‌కు ఇస్తామన్న కోట్లాది రూపాయల నిధులకే కోత పెట్టింది. 2024-25 బడ్జెట్లో ప్రకటించిన రూ.50 కోట్లలో గత మార్చిలో ప్రభుత్వం హడావుడిగా రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఆర్థిక సంవత్సరం ముగిసేముందు ఇచ్చిన రూ.25 కోట్లలో విదేశీ పథకం కోసం పరిషత్ అధికారులు రూ.12.5 కోట్లకు చెక్కు రెడీ చేసి ఫైనాన్స్ క్లియరెన్స్ కోసం పంపినా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నది. దీంతో మార్చి 31లోపే విద్యార్థులకు నగదు వేస్తామని అందరి ఖాతాల వివరాలు మళ్లీ తీసుకున్నా.. జూన్ రెండో వారంవచ్చినా ఒక్కరూపాయి కూడా వారికి అందలేదు. తాజా బడ్జెట్‌లో పేరు గొప్పలా రూ.100 కోట్లు ప్రకటించినా అవి ఎన్ని వస్తాయో? ఎటు పోతాయో? తెలియని పరిస్థితి నెలకొన్నది. అసలు సర్కార్‌కు బ్రాహ్మణులపై ప్రేమ ఉన్నదా? లేక సవతితల్లి ప్రేమ చూపుతున్నారా? అంటూ బ్రాహ్మణ సంఘాలు మండిపడుతున్నాయి. ఇది బ్రాహ్మణులపై కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న వివక్షకు నిదర్శనమని సంఘాల ప్రతినిధులు అంటున్నారు.

గతమెంతో ఘనం

విదేశాల్లో విద్యాభ్యాసం కోసం ప్రవేశాలు పొందిన బ్రాహ్మణ విద్యార్థులకు వివేకానంద విదేశీ విద్యాపథకాన్ని దేశంలోనే మొదటిసారిగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుకు శ్రీకారం చుట్టింది. ఆనాడు ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షల ఆర్థికసాయం అందిస్తూ వచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏటా 100 నుంచి 150 మంది విద్యార్థుల వరకు లబ్ధి పొందారు. పథకం ప్రారంభించిననాటి నుంచి 2023 వరకు మొత్తం 788 మందికి రూ.83 కోట్లను ప్రభుత్వం అందజేసింది. అందులో 350 మంది పూర్తిగా లబ్ధి పొందారు.

బ్రాహ్మణుల పట్ల సర్కారు వివక్ష

బ్రాహ్మణుల పట్ల తెలంగాణ సర్కారు వివక్ష చూపుతున్నది. ఈసారి బడ్జెట్లో రూ.100 కోట్లు ప్రకటించారు. కానీ నిరుడు బడ్జెట్‌లో ప్రకటించిన డబ్బులే ఇంకా పరిషత్‌కు రాలేదు. మార్చి నెలలో రూ.25 కోట్లు విడుదల చేసినా ఆర్థిక శాఖ క్లియరెన్స్ కావాలంటూ పెండింగ్‌లో పెట్టారు. మిగతా 25 కోట్లు వెనక్కుపోయాయి. ఈ పథకాన్ని నమ్ముకుని విదేశాలకు వెళ్లిన విద్యార్థులకు సరైన సహకారం అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా ఆలస్యమైతే పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతాం. ఆ దిశగా త్వరలోనే అన్ని సంఘాలను కలుపుకుని కార్యాచరణను ప్రకటిస్తాం.

- మోతుకూరి రామేశ్వర్‌రావు, అధ్యక్షుడు, తెలంగాణ బ్రాహ్మణ సేవాసంఘాల సమాఖ్య

పిల్లలు విదేశాల రెస్టారెంట్లలో పనిచేస్తున్నారు

విదేశీ విద్యాపథకంలో ఎంపికయ్యారని సంతోషించాం. రెండు విడతల డబ్బులు వచ్చాయి. ఆ తర్వాత ఆగిపోయింది. ఎన్నిసార్లు పరిషత్ ఆఫీస్‌కు వెళ్లినా ఫలితం లేదు. సమయానికి డబ్బు అందక పిల్లలు విదేశాల రెస్టారెంట్లలో పనిచేస్తున్నారు. అమెరికాలాంటి దేశాల్లో పరిస్థితి చాలా దారుణంగా ఉన్నది. స్టూడెంట్ వీసాపై వెళ్లి వర్క్ చేస్తే వెనక్కు పంపుతారనే భయంలో పిల్లలు ఉన్నారు. మా అబ్బాయితోపాటు మా బంధువుల పిల్లలు ఇద్దరి పరిస్థితి కూడా ఇదే. ప్రభుత్వం చొరవ తీసుకొని విద్యార్థులకు డబ్బులు అందేలా చూడాలి.

- విదేశీ విద్యాపథకం లబ్ధిదారుడి తండ్రి

612 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి నోటిఫికేషన్!

- ఎన్ఎంసీ నోటీసులతో సర్కారులో కదలిక
- మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదలకు చాన్స్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 612 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మూడు, నాలుగు రోజుల్లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నది. ఇటీవల ఎన్ఎంసీ నోటీసులతో స్పందించిన సర్కారు ఈ మేరకు పోస్టుల భర్తీకి సిద్ధమైనట్టు తెలిసింది. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లు, మౌలిక వసతులు లేవని ఇటీవల ఎన్ఎంసీ 26 కళాశాలలకు నోటీసులు ఇవ్వడంతో నిద్రలేచిన సర్కారు.. వైద్య కళాశాలల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించాలని, ఇందుకు ఓ కమిటీ ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతోపాటు బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్ఎంసీ విచారణలో వీలైనంత త్వరగా ఫ్యాకల్టీని నియమించుకోవాలని హెల్త్ సెక్రటరీ, డీఎంఈలను జాతీయ వై